శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కూర 'గాయాలు'

- అమాంతం పెరిగిన ధరలు
- డిమాండ్‌కు సరిపడే సరఫరా లేకపోవడమే కారణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూరగాయల ధరలు రోజురోజుకూ కొండెక్కుతున్నాయి. డిమాండుకు సరిపడా సరఫరా లేకపోవడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు...

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమాటాల ధర మాత్రమే పెరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల రేట్లు చుక్కల్లో చేరాయి. రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వర్షాలు సరిగ్గా లేకపోవడంతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అన్నిరకాల ధరలకు రెక్కలొచ్చాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలో ఏ రోజుకా రోజు కూరగాయలు కొనుగోలు చేయడం ఎక్కువ. దీంతో చాలా మంది తోపుడుబండ్ల తో కాలనీల్లో తిరుగుతూ కూరగాయలు విక్రయిస్తుంటారు. కానీ వాటి ధరలు అధికంగా ఉండటంతో తోపుడు బండ్ల వారు రావడమే మానేశారు. కర్నూలు మార్కెట్ యార్డుకు స్థానిక రైతులు పండించిన కూరగాయలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కూడా కూరగాయలు వస్తున్నాయి. వాటిని కొందరు కొనుగోలు చేసి రైతు బజార్‌లలో విక్రయిస్తుంటారు. స్థానికంగా టమోటా దిగుబడి సరిగ్గా లేకపోవడంతో కర్నూలు మార్కెట్‌కు మదనపల్లి, మొలకలచెరువు నుంచి టమోటాలు వస్తున్నాయి. ప్రస్తుతం స్థానికంగా మిర్చి పంట లేకపోవడంతో కర్ణాటకలోని బెళగాం నుంచి మిర్చి వస్తోంది. వంకాయ, క్యారెట్, క్యాబేజీ, ఆలూ, చెవులేకాయ వంటి కూరగాయలు స్థానికంగా చుట్టు పక్కల ప్రాంతాల రైతులు తీసుకువస్తున్నారు. డిమాండుకు సరిపడా సరుకు రాకపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. కర్నూలు నగరంలో మొన్నటి వరకూ కిలో రూ.25 ఉన్న టమోటా ప్రస్తుతం రూ.40 పలుకుతోంది. టమోటాతో పాటు అన్ని కూరగాయల ధరలు పెరిగిపోయాయి. మొన్నటి వరకూ కిలో రూ.40 ఉన్న వంకాయ రూ.50, రూ.30 ఉన్న బెండ రూ.40కు, రూ.40 ఉన్న పచ్చిమిర్చి రూ.70కు పెరిగాయి. కాకర, బీర కిలో రూ.80, కాలీఫ్లవర్ రూ.45, క్యారెట్ రూ.55, క్యాబేజీ రూ.40, ఆలూ కిలో రూ.50, చెవులేకాయ రూ.50, బీట్‌రూట్ రూ.46కు విక్రయిస్తున్నారు. అల్లం ధర అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం కిలో రూ.200కు పెరిగింది. నంద్యాలలో టమోటా కిలో రూ.50, వంకాయ కిలో రూ.60, మునక్కాయలు ఒక్కోటి రూ.10, బీరకాయ కిలో రూ.60, ఆలూ రూ.50, క్యారెట్ రూ.40కు విక్రయిస్తున్నారు. ఆదోనిలో టమాటాలు కిలో రూ.60కి విక్రయిస్తున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.23 నుంచి రూ.50కి చేరాయి. ఆలూ, బీన్స్, క్యాబేజీ పువ్వు గత నెలలో కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.90కి విక్రయిస్తున్నారు. క్యారెట్ రూ.40 నుంచి రూ.70కి చేరుకుంది. బీరకాయలు, గోరుచిక్కుడు, వంకాయలు, దొండకాయలు, బెండకాయలు, క్యాబేజీ రూ.30 నుంచి రూ.60కి పెరిగాయి. సొరకంద రూ.20 నుంచి రూ.30కి, కాకరకాయలు రూ.30 నుంచి రూ.50కి చేరుకున్నాయి. కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యుల జేబులు చిల్లుపడుతున్నాయి.

ఆర్థిక భారమే..

రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలతో మధ్య తరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక భారం పడింది. ధరలు పెరగడంతో రోజువారీ వంటకాల్లో ఉల్లి, టమాట వినియోగాన్ని తగ్గించేస్తున్నాం. ధరల భారంతో కుటుంబ పోషణ కష్టమవుతోంది.

- పార్వతమ్మ, ఆదోని.

ధరలు మండిపోతున్నాయి..

కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. సామాన్యులు కూరగాయలు తినలేని పరిస్థితి ఉంది.. టమోట కిలో రూ.50 రూపాయలు, వంకాయ కిలో రూ.60, మునక్కాయలు ఒక్కొక్కటి 10 రూపాయలు పలుకుతుంది. కాబట్టి కూరగాయల ధరలను తగ్గించాలని కోరుతున్నాం.

- దేరంగుల రామేశ్వరి, నంద్యాల.

పొరపాట్లకు తావులేకుండా కౌంటింగ్

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం కౌంటింగ్ విధులను జాగ్రత్తగా, పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు జిఆర్‌సి కన్వెన్షన్ హాలులో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండు సెషన్లలో మొత్తం 1174 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 60 టేబుళ్లను ఏర్పాటు చేసి, ప్రతి టేబుల్‌కు 10 మందితో ప్రాక్టికల్‌గా ఈవిఎంలలో కొన్ని ఓట్లు వేయించి వాటిని ఎలా లెక్కించాలి అన్న అంశంపై శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి వ్యాలిడ్, ఇన్వాలిడ్ అన్న అంశాలను ఉదాహరణలతో వివరించారు. ఎలా కౌంటింగ్ చేస్తున్నారని ప్రతి టేబుల్ దగ్గరికి వెళ్లి కలెక్టర్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ... జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని, కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది కచ్చితంగా కౌంటింగ్ రోజున ఉదయం 7 గంటలకే రాయలసీమ యూనివర్సిటీ లోని కౌంటింగ్ హాల్‌లో విధుల్లో ఉండాలని తెలిపారు. 5 గంటలకు కలెక్టరేట్ వద్ద సిబ్బంది కోసం బస్సులను ఏర్పాటు చేసి రాయలసీమ యూనివర్సిటీకి చేర్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలింగ్ రోజున ఏ విధంగా అయితే బాధ్యతతో విధులు నిర్వహించారో, అంతకంటే ఎక్కువ బాధ్యతతో కౌంటింగ్ రోజున విధులు నిర్వహించాలని ఆదేశించారు. 27న జరిగే మొదటి ర్యాండమైజేష న్‌లో కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్వైజర్ ఎవరనే విషయం తెలుస్తుందన్నారు. జూన్ 2న జరిగే రెండో ర్యాండమైజేషన్ ద్వారా ఏ అసెంబ్లీ నియోజక వర్గాలకు కేటాయించడం జరిగిందనే విషయం తెలుస్తుందన్నారు. జూన్ 4న ఉదయం 5.30 గంటలకు జరిగే ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ కేంద్రాలలో ఏ టేబుల్‌కి కేటాయించబడారనే విషయం తెలుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కోసం రాయలసీమ యూనివర్సిటీలో అసెంబ్లీ, పార్లమెంట్ కౌంటింగ్ కేంద్రాల కొరకు వేరువేరుగా కౌంటింగ్ హాల్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి కౌంటింగ్ హాల్‌లో పార్లమెంట్‌కి 14 టేబుల్స్, అసెంబ్లీకి 14 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ సమయంలో రౌండ్ వారీగా వివరాలను ఏజెంట్లకు వినపడేలా కౌంటింగ్ సిబ్బంది చదవాలని, మైక్రో అబ్జర్వర్లు కూడా సదరు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రౌండ్ పూర్తయిన వెంటనే ఏజెంట్లతో సంతకాలు తీసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి పార్లమెంటుకు గ్రీన్ కవర్స్, అసెంబ్లీకి పింక్ కవర్స్ టేబుల్స్ మీద ఉంచడం జరుగుతుందన్నారు. మొదటిగా సదరు కవర్ ఎన్నికల కమీషన్ వారు ఇచ్చినదా కదా? బ్యాలెట్ కు సంబంధించి అటెస్టేషన్ చేసిన అధికారి సీల్, సంతకం, డిక్లరేషన్, సీరియల్ నెంబర్, ఓటర్ సంతకం ఉందా సీరియల్ నెంబర్ మ్యాచ్ అవుతుందా లేదా అని ప్రాథమిక నిర్ధారణ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలలో అందుబాటులో ఉండాలని సూచించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, రిటర్నింగ్ అధికారులు శేషిరెడ్డి, చిరంజీవి, రామునాయక్, మురళీ, నోడల్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'బేటీ బచావో.. బేటీ పడావో',

ఎంపిటి చట్టంపై అవగాహన అవసరం

- డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కాంప్రిహెన్సివ్ అబార్షన్ కేర్ (ఎంపిటి చట్టంపై), 'బేటీ బచావో.. బేటీ పడావో' అంశంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ కోరారు. శుక్రవారం కర్నూలు వైద్య కళాశాల ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కాంప్రిహెన్సివ్ అబార్శన్ కేర్ (ఎంపిటి చట్టం), 'బేటీ బచావో.. బేటీ పడావో' అనే అంశాలపై ప్రయివేట్ హాస్పిటల్స్ డాక్టర్స్, మేనేజర్స్ కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో కాంప్రిహెన్సివ్ అబార్షన్ కేర్ రిజిస్ట్రేషన్ కోసం 35 ప్రయివేట్, ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి దరఖాస్తులు అందాయని తెలిపారు. వాటిని జిల్లాస్థాయి కమిటీ ఆమోదం అనంతరం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించాల్సిన రికార్డులు, రిపోర్టుల గురించి వారికి తెలిపారు. అనంతరం 'బేటీ బచావో.. బేటీ పడావో' అనే నినాదంతో ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అని కోరారు. ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాల్లో ప్రయివేట్ ఆస్పత్రులు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. డిపిఎంఒ ఉమా, డిఎంఒ నూకరాజు, డెమో ప్రమీలాదేవి, డిపిహెచ్ఎన్ఒ ఇందిరా, ఎస్ఒ హేమసుందరం, హెచ్ఇఒ శ్రీనివాసులు, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఎపిడిమాలజిస్ట్ వేణుగోపాల్, హెచ్ఇ పద్మావతి, ప్రయివేట్ ఆస్పత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఆస్పత్రులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రవీణ్ కుమార్

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం కర్నూలు జిల్లావ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా 3,611 మంది విద్యార్థులు హాజరయ్యారు. 177 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఒ ఎస్‌విఎస్.గురువయ్య శెట్టి వెల్లడించారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించగా 897 మంది విద్యార్థులు హాజరు కాగా 83 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఎండుతున్న మొక్కలు.. స్పందించని అధికారులు...

- పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో రూ.కోటికి పైగా ఖర్చుతో ప్రధాన రోడ్ల మధ్యలో ఆర్‌సిసి గోడలతో ట్రాఫిక్ డివైడర్లకు రంగులు వేసి చేతులు దులుపుకున్నారని, రంగులపై ఉన్న శ్రద్ధ రూ.లక్షలు వెచ్చించి నాటిన మొక్కలపై లేదని, మొక్కలు ఎండిపోతున్నా అధికారులు స్పందించడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఈ.పుల్లారెడ్డి, సివి.వర్మ, పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు టి.హరికృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి మద్దిలేటి తెలిపారు. శుక్రవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం, పర్యావరణ పరిరక్షణ కమిటీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి బృందం కొండారెడ్డి బురుజు నుంచి రాజ్‌విహార్, సిక్యాంపు కూడలి మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వరకు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల పరిధిలో మొక్కలు నీళ్లు పోయక ఎండిపోయాయా, కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం మొక్కలు వేశారా అని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విచారణ జరిపి సంబంధిత అధికారి, కాంట్రాక్టర్ నుంచి మొత్తం ఖర్చును వసూలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.కోట్లు ఖర్చు చేసి ఆర్‌సిసి గోడలు నిర్మించి వాటి మధ్యలో మట్టి వేసి రూ.లక్షలు వెచ్చించి మొక్కలు నాటారని తెలిపారు. కొండారెడ్డి బురుజు నుంచి పాత కంట్రోల్ రూమ్ వరకు వేసిన మొక్కలు ఎండిపోగా వాటిని తొలగించారని చెప్పారు. సిక్యాంపు కూడలి నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు వేసిన వందలాది మొక్కలు ఎండిపోయాయని తెలిపారు. అందులో ఒక్క మొక్క మాత్రమే కనిపించిందని, మిగతా మొక్కలన్నీ పూర్తిగా నేలమట్టమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని మొక్కలు రూ.1000 నుంచి రూ.5 వేల వరకు వెచ్చించి కొనుగోలు చేసినట్లు తెలిసిందన్నారు. పాత మట్టిని తీసి కొత్త మట్టి వేసి నాటిన మొక్కలు ఎందుకు ఎండిపోయాయని ప్రశ్నించారు. నీరు సక్రమంగా పోయక ఎండిపోయాయా, లేక కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం మొక్కలు కొనుగోలు చేశారా అనే విషయంపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్ల నుంచి మొత్తం ఖర్చును వసూలు చేసి ప్రజాధనాన్ని కాపాడాలని కోరారు. నగర నాయకులు కె.శ్రీనివాసులు, ఎన్.మద్దిలేటి, జి.లక్ష్మిరెడ్డి, కె.వెంకటరామిరెడ్డి, ఎస్.షాకీర్, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలను పరిశీలిస్తున్న నాయకులు

ఉరుములతో కూడిన భారీ వర్షం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

జిల్లాలో పలుచోట్ల శుక్రవారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న తుఫాన్ కారణంగా తెలుగు రాష్ట్రాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని తెలిపారు. అందులో భాగంగా కర్నూలు మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగరంలో చాలా చోట్ల కాలువలు పొంగి పొర్లాయి. వర్షం కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు లోతట్టు ప్రాంతాలు, నీరు పొంగి పొర్లుతున్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు. పాతబస్తీ, ఓల్డ్ టౌన్, చెక్ పోస్ట్ దగ్గర సంతోష్ కల్యాణ మండపం దగ్గర నదిని తలపించేలా కాలువలు పొంగి పొర్లాయి. శ్రీరామ్ నగర్, లక్ష్మీ నగర్, అశోక్ నగర్ బ్రిడ్జి కింద, ఆనంద్ థియేటర్ బ్రిడ్జి కింద చాలా ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ద్విచక్ర వాహనదారులు నీటిలో వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్న వర్షం వచ్చినా నగరంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి వర్షాలు మొదలు కాకముందే కాలువలు, రోడ్ల పనులు పూర్తి చేసి ప్రజలను ప్రమాదాల నుంచి రక్షించాలని కోరుతున్నారు.

డిగ్రీ సెమిస్టర్‌లో ఐదుగురు డీబార్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షలు శుక్రవారం విభాగం ఉన్నతాధికారులు వెల్లడించారు. రెండో సెమిస్టర్ పరీక్షకు 88 శాతం హాజరు కాగా నాలుగో సెమిస్టర్‌కు 92 శాతం హాజరు నమోదు అయిందని వెల్లడించారు.

బిఎస్ఎన్ఎల్ ఎఐజిఈటిఒఎ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా బిఎస్ఎన్ఎల్ ఆఫీసర్ల సంఘం ఆల్ ఇండియా గ్రాడ్యుయేట్స్ ఇంజినీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎఐజిఈటిఒఎ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం 4వ జిల్లా సమావేశంలో ఆంధ్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎవి.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్లు ఎస్‌కెఎన్‌వికె.సత్యనారాయణ, వి.జాన్సన్ అధ్యక్షతన ఎన్నుకున్నట్లు రాష్ట్ర సిడబ్ల్యుసి మెంబర్ పి.ఇమ్మానుయేల్ బాబు తెలిపారు. నూతన జిల్లా ప్రెసిడెంట్‌గా హెచ్.జకరయ్య, జిల్లా ఫైనాన్స్ సెక్రటరీగా సి.చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా కెఎం.శివశంకరయ్య, అసిస్టెంట్ జిల్లా కార్యదర్శులుగా ఎంఎస్.శంకర్ ప్రసాద్, టి.వెంకటేశ్వర్లు, కెవి.రామాంజనేయరెడ్డి ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం బిఎస్ఎన్ఎల్ సంస్థ అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి, వినియోగదారులు, సమాజ అభివృద్ధికి పాటు పడతామని ప్రమాణం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయండి

- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కౌంటింగ్ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్‌ల లైవ్ ఫీడ్‌ను పరిశీలించిన అనంతరం ఈవిఎమ్ స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఇంజనీరింగ్ బ్లాక్, లైబ్రరీ విభాగంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్లను పరిశీలించి సంబంధింత రిజిస్టర్లలో సంతకాలు చేశారు. అన్ని కౌంటింగ్ హాళ్ల లోపల, బయట నిర్దేశించిన విధంగా ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన క్యాబిన్స్ నుంచి ఏజెంట్లతో రౌండ్ల వారీగా సంతకాలు తీసుకునే విధంగా హాల్ ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఈవిఎమ్‌లను స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ హాలుకు ఏజెంట్ల సమక్షంలో తీసుకొచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత ఆర్ఓకు సూచించారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూం నుండి కౌంటింగ్ హాళ్ళకు, తిరిగి కౌంటింగ్ హాళ్ల నుండి స్ట్రాంగ్ రూములకు తీసుకువెళ్ళే సిబ్బందికి టీ షర్టులను ప్రొక్యూర్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఈవీఎంలు తీసుకువచ్చే సిబ్బందికి తెలుపు టీషర్టు, అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలు తీసుకువచ్చే సిబ్బందికి పింక్ రంగు టీ షర్టులను కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ ఏజెంట్‌లకు బ్యాడ్జిలు ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి, మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళీ, ఆర్అండ్‌బి ఎస్ఈ నాగరాజు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా ఎపిపిఎస్‌సి పరీక్ష నిర్వాహణ

- డిఆర్ఒ మధుసూదన్ రావు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఎపిపిఎస్‌సి వారు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే పరీక్షలలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండ నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె మధుసూదన్ రావు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్‌లో డిఆర్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలోని 8 కేంద్రాలలో 2230 మంది పరీక్ష రాయనున్నారని అన్నారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుండి 11.30 గంటల వరకు ఆన్లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని, హాజరయ్యేవారు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పోలీస్ శాఖ వారు ఎగ్జామినేషన్ సెంటర్ల దగ్గర 144 సెక్షన్ అమలయేలా చూడాలని, విద్యుత్ శాఖ వారు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తహసిల్దార్లు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌కు అనుమతులు ఇవ్వాలని, ఆర్టీసీ వారు సమయానుకూలంగా బస్సులను నడపాలని, కాలేజీల యాజమాన్యాలు ఎగ్జామినేషన్ సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండ ఎగ్జామినేషన్ జరగడానికి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ ఆర్ వెంకటరమణ, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ అనిల్ కుమార్, ఏపీ ఎస్పిడీసీఎల్ ఈఈ ఓబులేష, పోలీస్ శాఖ, ఆర్టీసీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ మధుసూదన్ రావు

ప్రమాదాలు జరిగితేనే మరమ్మతులు చేస్తారా..?

- అధికారుల తీరుపై వాహనదారుల ఆగ్రహం

ప్రజాశక్తి - పత్తికొండ

ప్రమాదాలు జరిగితే కానీ రోడ్డు మరమ్మతులు చేయరా అని ఆర్అండ్‌బి అధికారులపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ నుంచి ఆదోనికి వెళ్లే ప్రధాన రహదారి శ్రీరామ హాస్పిటల్ సమీపంలో కల్వర్టుపై గుంతపడి ప్రమాదకరంగా మారిన రోడ్డును పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా రోడ్డు మరమ్మతులు పనులు చేశారని పేర్కొంటున్నారు. ఆర్అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కుకు ఇదే ఒక నిదర్శనమని విమర్శిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు.

గుంత పడిన రోడ్డు

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పరీక్షకు జిల్లాలో మొత్తం 4,231 మంది విద్యార్థులు హాజరు కాగా 1,572 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాల్లో సిట్టింగ్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేసినట్లు డిఇఒ కె.శామ్యూల్ వెల్లడించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ చోటు చేసుకోలేదని పేర్కొన్నారు.

61 మంది విద్యార్థులు హాజరు

తుగ్గలి : తుగ్గలిలోని నోవీ, జడ్‌పి పాఠశాలలో శుక్రవారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 61 మంది విద్యార్థులు హాజరు కాగా 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఇఒ రామ వెంకటేశ్వర్ల గౌడ్ శుక్రవారం తెలిపారు. తుగ్గలి జడ్‌పి పాఠశాలలో 38 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 30 మంది హాజరయ్యారని చెప్పారు. 8 మంది విద్యార్థులు హాజరు కాలేదన్నారు. అలాగే నోవి పాఠశాలలో 58 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 31 మంది హాజరు కాగా 27 మంది హాజరు కాలేదని తెలిపారు. మొత్తం 96 మంది విద్యార్థులకు గాను 61 మంది విద్యార్థులు హాజరైనట్లు, 35 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 'పది' విద్యార్థికి గాయాలు
- గుత్తి హాస్పిటల్‌కు తరలింపు
- పరీక్షకు గైర్హాజరు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు వెళుండగా రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలయ్యాయి. సూర్య తండాకు చెందిన విద్యార్థి గణేష్ నాయక్ రాతన గ్రామ సమీపంలోని గిరిజన గురుకుల పాఠశాలలో గతేడాది 10వ తరగతి చదివారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. తుగ్గలి జిల్లా పరిషత్ పాఠశాలలో సప్లిమెంటరీ పరీక్ష రాయడానికి శుక్రవారం తన మిత్రులు సూర్య తండా చరణ్ నాయక్, బాడతండా చరణ్ నాయక్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై తుగ్గలికి బయల్దేరారు. గుత్తి, పత్తికొండ రహదారిపై పంజాబ్ ధాబా వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వారు అనంతపురం జిల్లా గుత్తి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గణేష్ నాయక్ పరీక్షలకు హాజరు కాలేకపోయారు. ఈ విషయంపై తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయ పడిన విద్యార్థి

కలల సాకారానికి తిరుగులేని ఎంపిక 'కేశవరెడ్డి'

- పాఠశాల ప్రిన్సిపల్ లలిత

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలల సాకారానికి తిరుగులేని ఎంపిక కేశవరెడ్డి పాఠశాలలని పాఠశాల ప్రిన్సిపల్ లలిత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 30 అద్భుతమైన క్యాంపస్‌లతో డే స్కూల్, రెసిడెన్షియల్ స్కూల్, సెమీ రెసిడెన్షియల్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సిలో మార్కుల విధమైనా, గ్రేడింగ్ విధమైనా ఉన్నత ఫలితాలను పరిశీలించినా, ఓవరాల్ ఫలితాలు పరిశీలించినా కేశవరెడ్డిదే పైచేయి అని చెప్పారు. వేలాది మంది డాక్టర్లు, ఇంజినీర్లను, వందలాది మంది ఐఎఎస్, ఐపిఎస్ ఆఫీసర్లను, అనేక మంది జడ్జీలు, కమిషనర్లను, లెక్కలేనంతమంది ఎంఎన్‌సి డైరెక్టర్స్ అండ్ మేనేజర్స్‌ను, ఇతర టాప్ ప్రొఫెషన్స్‌లో అనేక మంది విద్యార్థులను తయారు చేసిన ఘనత కేశవరెడ్డికి సొంతమని వివరించారు.

విద్యార్థి ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ

లాంగ్వేజ్ స్కిల్స్ పెంచేందుకు 'THE' ప్రోగ్రాం, స్పోకెన్ ఇంగ్లీష్ కోసం 'KIET' ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్కూలింగ్ కోసం ప్రత్యేకంగా ఆకృతి దాల్చిన చైల్డ్ ఫ్రెండ్లీ క్యాంపస్‌లు, ప్రత్యేకంగా ట్రెయిన్ టీచర్స్‌తో ప్లేవే మెథడ్‌లో బోధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంకా బయట చక్కటి అలవాట్లు, మంచి ప్రవర్తన కలిగిన విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎంచుకున్న ఏ కెరియర్‌లోనైనా విజేతలుగా రాణించేందుకు అవసరమైన పరిజ్ఞానం అందిస్తున్నట్లు చెప్పారు. పటిష్టమైన ఐఐటి, మెడిసిన్ ఫౌండేషన్, ఒలంపియాడ్, ఇతర పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఇది కేశవరెడ్డి మార్క్ ఆఫ్ స్కూలింగ్ అని వివరించారు.

పత్తి రైతుపై విత్తన పోటు

- విత్తనాల ప్యాకెట్ ధర రూ.13 పెంపు - ఉమ్మడి జిల్లా రైతులపై రూ. 27 కోట్ల భారం - ఇప్పటికే బ్లాక్ మార్కెట్‌లో రూ. 200 అదనంగా వసూలు

పత్తి రైతులపై ఈ ఏడాది సాగుకు ముందే కేంద్ర ప్రభుత్వం గుదిబండ వేసింది. పత్తి విత్తనాల ప్యాకెట్‌పై 13 రూపాయల దాకా పెంచుకోవచ్చని కంపెనీల యాజమాన్యాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇప్పటికే ప్రకృతి వైపరీత్యాలు, పాలకుల నిర్లక్ష్యంతో పత్తి రైతు గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల ఊబిలో కూరుకుపోతూనే ఉన్నారు. పండిన పత్తికి కూడా సరైన ధరలు లభించడం లేదు. సీజన్‌కు ముందుగా పత్తి రైతుకు ఆశ కల్పిస్తూ క్వింటాలు రూ.12 వేల నుండి రూ.13 వేల దాకా పలికే ధర దిగుబడి చేతికి అందగానే క్వింటా ధర రూ. 5 వేల నుండి రూ.6 వేలకు తగ్గిస్తున్నారు. ధరలు తగ్గిపోవడంతో రైతులు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యల పాలవుతున్నారు. ప్రస్తుతం ఈ నష్టాలకు తోడు గోరు చుట్టుపై రోకటి పోటు అన్న చందంగా ఒక ప్యాకెట్ విత్తనాలపై ధర పెంచుకోవడానికి కంపెనీల యాజమాన్యాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం రైతుల పట్ల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది.

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి పంటను ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగు చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల గణంకాల ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 6 లక్షల 60 వేల ఎకరాలలో పత్తి సాగు చేస్తున్నారు. గత సంవత్సరం పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.853 ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 864 పత్తి విత్తనాల కంపెనీల యాజమాన్యాలు ధరను పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఎకరాకు మూడు ప్యాకెట్ల చొప్పున ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 20 లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయి. ఆ లెక్కన 20 లక్షల ప్యాకెట్లకు రూ. 13 చొప్పున దాదాపు రూ. 27 కోట్లు ఉమ్మడి జిల్లా రైతులపై భారం పడనుంది. .ఇదే కాకుండా గుర్తింపు పొందిన పత్తి విత్తనాల కొరత ఉమ్మడి జిల్లాలో తీవ్రంగా ఉంది. ఒక ప్యాకెట్ పత్తి విత్తనాల ధర రూ.864 ఉంటే బ్లాక్ మార్కెట్లో రూ.900 నుంచి రూ.1000 దాకా అధిక ధర నిర్ణయించి డీలర్లు రైతులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ సంవత్సరం ముందే వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు పొలాలు దుక్కి దున్ని విత్తనాలు వేసేందుకు ముందస్తుగా సిద్ధమవు తున్నారు. దీంతో వ్యాపారులు ప్రముఖ కంపెనీల పత్తి విత్తనాల ధరను భారీగా పెంచుతున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు ఒక్కో ప్యాకెట్‌కు రూ.200 అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో విత్తన ప్రాసెసింగ్ కంపెనీలపై, విత్తన దుకాణాలపై అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు తప్పా ధరలు నియంత్రించడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

సంచికను ఆవిష్కరిస్తున్న లియాఫీ నాయకులు

ఏజెంట్ల సంక్షేమమే లియాఫీ లక్ష్యం

- లియాఫీ కడప డివిజన్ అధ్యక్షులు జయభారత్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఏజెంట్ల సంక్షేమమే లియాఫీ లక్ష్యమని లియాఫీ కడప డివిజన్ అధ్యక్షులు జయ భారత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మిగనూరు బ్రాంచ్ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. లియాఫీ ఎమ్మిగనూరు బ్రాంచి అధ్యక్షులు కె.వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆల్ ఇండియా లైఫ్ ఇన్స్యూరెన్స్ ఏజెంట్లకు లియోఫీ అండగా ఉంటూ వారి హక్కులు సాధనకు, సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తోందని తెలిపారు. ఆల్ ఇండియా లియాఫీ 1964 అనేక విజయాలు సాధించిందిన్నారు. గ్రూప్ ఇన్స్యూరెన్స్ రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచినట్లు తెలిపారు. అదే విధంగా ఆల్ ఇండియా సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. అనంతరం లియాఫీ 1964 హౌస్ మ్యాగజైన్స్ విడుదల చేశారు. ఆల్ ఇండియా లియాఫీ మాజీ ఈసీ మెంబర్ రమేష్, జోనల్ ఈసీ మెంబర్ రంగస్వామి, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఆంధ్రయ్య, డివిజన్ నాయకులు జయరాం, హరినాథ్, బ్రాంచి సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి, ట్రెజరర్ జెకె.శివరాముడు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండలంలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పదో తరగతి తప్పిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు ఎపి మోడల్ స్కూల్, కెజిబివి పాఠశాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారులు తెలిపారు. మొదటిరోజు నిర్వహించిన తెలుగు పరీక్షలో 93 మంది విద్యార్థులకు గాను 51 మంది హాజరు కాగా 42మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- వ్యక్తిపై కేసు నమోదు - సిఐ నిరంజన్ రెడ్డి

మాట్లాడుతున్న తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో పత్తికొండకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 96 కర్ణాటక టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. అలాగే ఎలాంటి అనుమతి పత్రాలూ లేని 12 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో, తర్వాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సిఐ తెలిపారు. ఇందులో భాగంగా తెల్లవారు జామున పలు ఇళ్లలో సోదాలు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బైండోవర్స్, ట్రబుల్ మ్యాంగర్స్ ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాల్లో గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామస్తులతో సమావేశమై ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడకూడదని హెచ్చరించారు. గ్రామంలో తనిఖీల్లో భాగంగా రికార్డులు లేని పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐలు చిన్న పీరయ్య, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలోని సుద్ద బావి, ఎస్సీ కాలనీల్లో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది డిమాండ్ చేశారు. శుక్రవారం సుద్ధబావి కాలనీవాసులు ఖాళీ బిందెలతో ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాదాపు రెండు నెలలుగా ఆస్పరిలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగనాథనహళ్లి వాటర్‌ను సక్రమంగా అందించి ఆస్పరికి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒను కోరారు. అనంతరం ఎంపిడిఒ లక్ష్మీ నారాయణకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి ట్యాంకర్లతో నీటి సరఫరా చేయిస్తామని ఎంపిడిఒ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. తాగునీరు అందించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాలనీ వాసులు వీరేష్, నరసప్ప, నాగేంద్ర, శివ, బంగారప్ప, మహానంది, లాలప్ప, సావిత్రమ్మ, రత్నమ్మ, రంగమ్మ, మునెమ్మ, ఈరమ్మ, లాలమ్మ, సుహాసిని, శంకరమ్మ పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

గోడౌన్‌లో ఉన్న టార్పాలిన్లు

అందుబాటులో టార్పాలిన్లు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కింద అందిస్తున్న టార్పాలిన్లను సద్వినియోగం చేసుకోవాలని కెడిసిఎంఎస్ మేనేజర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. బయట మార్కెట్‌లో నాసిరకం టార్పాలిన్లను కొని రైతులు మోసపోవద్దని తెలిపారు. మంచి నాణ్యత కలిగిన టార్పాలిన్లు 250 జిసిఎం క్వాలిటీ గల 10కిలోల టార్పాలిన్లను కేవలం రూ.1,700లకే అందజేస్తామన్నారు. గ్రామాల్లో ఉండే రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణ శివారులోని శిరుగుప్ప చెక్ పోస్టు వద్ద డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ రామచంద్రా రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పట్టణంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను నిల్వ చేసి ఎరువుగా తయారు చేసి రైతులకు అందించాలని అధికారులను ఆదేశించారు. చెత్త రీసైక్లింగ్ ప్రక్రియలో పొగ వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని పరిసరాల్లోని దుకాణదారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- భారీగా ఆగిపోయిన వాహనాలు
- జెసిబితో తొలగించిన సిబ్బంది

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లతో పాటు మండలంలోని హెచ్.కైరవాడి, పుట్టపాశం, వెముగోడు, తిప్పనూరు, కులుమాల, గంజిహళ్లితో పాటు వివిధ గ్రామాల్లో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. హోరుగాలి, భారీ ఉరుములు, మెరుపులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి తీగలు తెగి అంధకారం నెలకొంది. దీనికి తోడు భారీ శబ్దంతో కూడిన మెరుపులు, ఉరుములతో జనం బెంబేలెత్తిపోయారు. పుట్టపాశం, వెముగోడు గ్రామాల మధ్య రోడ్డుకు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు నేలకొరిగి రోడ్డుపై అడ్డంగా పడడంతో కర్నూలు, ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు గంటకు పైగా అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన సంబంధిత సిబ్బంది రంగంలోకి దిగి జెసిబి సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలను పక్కకు తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా పునరుద్ధరించారు.

గోనెగండ్లలో కురుస్తున్న వర్షం

కూకటి వేళ్లతో లేచి పడిన వేపచెట్టు

- విద్యుత్‌కు, వాహన రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 29వ వార్డు ఉద్యోగ నగర్‌లో శుక్రవారం సాయంత్రం కురిసిన గాలివానకు వేపచెట్టు కూకటి వేళ్లతో సహా రహదారికి అడ్డంగా పడింది. వేపచెట్టు రహదారికి అడ్డుగా పడడంతో వాహనదారులు, స్థానిక కాలనీవాసులు రాకపోకలు సాగించే వీలు లేకపోయింది. ఇదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. అడ్డుగా పడిన వేప చెట్టును త్వరగా తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.


కర్నూలులో విరిగిపడిన చెట్టు

కిష్టదొడ్డిలో వడగండ్ల వాన

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని కిష్టదొడ్డిలో శుక్రవారం వడగండ్ల వాన కురిసింది. ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములతో మండలంలో సాయంత్రం వాన బీభత్సం సృష్టించింది. ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు భయాందోళనకు గురి కావాల్సి వచ్చింది. అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. కిష్టదొడ్డిలో వడగండ్ల వాన కురవడంతో మురుగు కాలువల్లో నిండుకొని కొట్టుకు పోయాయి.

ఆర్థిక సాయం అందిస్తున్న తాయన్న

భజన బండలి అధ్యక్షులు తిక్కన్న మృతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన భజన మండలి సంఘం అధ్యక్షులు భజన తిక్కన్న అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆ వార్డు కౌన్సిలర్ తనయుడు తాయన్న ఆధ్వర్యంలో అంబేద్కర్ సొసైటీ డైరెక్టర్ కుంకునూరు వీరేష్‌లు తిక్కన్న మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకుంటామన్నారు తిక్కన్న అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'ఉపాధి'లో కానరాని ప్రథమ చికిత్స కిట్లు : సిపిఎం

ప్రజాశక్తి - పత్తికొండ

ఉపాధి కూలీలు పని చేసే ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా చెందారని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 6 వేల మంది ఉపాధి కూలీలు పనికి వెళ్తున్నారని తెలిపారు. పనిచేసే ప్రదేశంలో ఎవరికైనా అనారోగ్యం, రక్తపు గాయాలయితే అత్యవసర ప్రథమ చికిత్స కిట్లు లేవని చెప్పారు. ఉపాధి కూలీల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అధికారులపై మండిపడ్డారు. ఇప్పటికైనా ఉపాధి కూలీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో ఉపాధి కూలీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉపాధి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఇసుక రవాణాలో ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - సిబెళగల్

ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ఎస్ఐ తిమ్మారెడ్డి తనిఖీలో భాగంగా శుక్రవారం ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని సంఘాల గ్రామం కాగా ట్రాక్టర్‌ను, నిందితుని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అనంతరం బెళగల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పిల్లల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

- చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

సీజనల్ వ్యాధులు దరిచేరకుండా పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపుతూ జాగ్రత్తలు పాటించాలని సాష నర్సింగ్ హోమ్ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్ర వారం ఆయన మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా కొత్త, పాత నీరు కలవడం వల్ల అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. కాచి వడబోసిన నీరు తాగాలని, అలాకాకుండా మలినమైన నీరు తాగిన వారు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. దగ్గు, జ్వరం వచ్చిన సమయంలో వేడి చేసిన నీటినే తాగించాలని సూచించారు. పరిసరాల అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధి చెంది చిన్నారులు తినే పదార్థాలపై వాలడం వల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. చేతులు శుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు స్నానం చేస్తూ శారీరక శుభ్రత ఉండేలా చూడాలని సూచించారు. డెంగీ, మలేరియా, డయేరియా, అతిసార వ్యాధులు పిల్లలకు ఎక్కువ సోకే అవకాశం ఉందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఈగలు వృద్ధి చెందకుండా, దోమకాటు బారిన పడకుండా దోమతెర వాడుతూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల జ్వరం తీవ్రత తట్టుకోలేక అపస్మారక స్థితిలోకి జారుకునే ప్రమాదం ఉందని తెలిపారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి పిల్లలకు మెరుగైన వైద్యం చేయించాలని సూచించారు. పట్టణంలోని సాయి జూనియర్ కళాశాల పక్కన సాష నర్సింగ్ హోమ్ నెలకొల్పామని, గర్భినులకు తమ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ రేష్మ ఆధ్వర్యంలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే డాక్టర్ సలహాలు పాటించాలని సూచించారు. తమ ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. టీకాలు, వాక్సినేషన్ సదుపాయం ఉందని చెప్పారు. క్రిటికల్ రోగాల బారిన పడిన రోగులకు తమ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుబాటులో ఉందన్నారు.

సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం గ్రామ సచివాలయం-2 పరిధిలో భాగంగా ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం ప్రభుత్వ డాక్టర్ పావని సమక్షంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్‌డబ్ల్యు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైద్య పరీక్షల కోసం ప్రజలు తరలి వచ్చారు. సర్పంచి పాల్‌దినకర్, ఎంపిడిఒ రఘునాథ్ గుప్త, పంచాయతీ కార్యదర్శి బి.శివప్ప, సచివాలయం-2 ఎఎన్ఎం హనుమంతమ్మ, వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు, నర్సులు, ఆయాలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వైభవంగా నిత్యసహాయమాత మహోత్సవం

ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులో వెలసిన నిత్యసహాయమాత (మేరిమాత) మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్‌సిఎం చర్చి ఫాదర్ రెవరెండ్ సంజీవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేకంగా అలంకరించిన రథోత్సవంలో నిత్యసహాయమాత ప్రతిమను ప్రతిష్టించి స్థానిక ఆర్‌సిఎం చర్చి నుంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఫాదర్ చిన్నప్పరెడ్డి, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షులు మీసాల సుమలత

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. శుక్రవారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శాంతిభద్రతల కాపాడడం ప్రభుత్వ ముఖ్య బాధ్యత అని తెలిపారు. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం రాజకీయ మొహమాటానికి తావు లేకుండా సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. పోలీసులు, అధికార యంత్రాంగం కలిసికట్టుగా అసాంఘిక శక్తులపై ఉక్కు పాదం మోపినప్పుడే సమాజంలో శాంతిభద్రతలు మెరుగుపడతాయని తెలిపారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే న్యాయస్థానాలు, ప్రజల మద్దతు లభిస్తుందని, శాంతి భద్రతలు కాపాడటం ప్రభుత్వ ముఖ్య బాధ్యత అని చెప్పారు. నారాయణమ్మ, శేషమ్మ, శంకరమ్మ, గోవిందమ్మ, వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుమలత

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ ఫక్కీరప్ప

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి

- ఏపీడీ ఫక్కీరప్ప

ప్రజాశక్తి - ఆస్పరి

ఉపాధి కూలీలు ఉపాధి హామీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఏపీడీ ఫక్కీరప్ప సూచించారు. శుక్రవారం ఆస్పరిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం కింద ఐదెకరాల ఉన్న ప్రతి రైతూ తమ పొలంలో ఫారంపాండ్, డగౌట్ గుంతలు తీయించుకోవచ్చని తెలిపారు. దీని వల్ల సకాలంలో వర్షాలు రానప్పుడు గుంతలో నీటిని పంటకు వాడుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులకు ప్రభుత్వం ఆరు రకాల పండ్ల మొక్కలను ఉచితంగా అందిస్తూ మూడెళ్ల వరకు ఖర్చు భరిస్తుందని తెలిపారు. పొలంలో పండ్ల మొక్కల పెంచుకోవడానికి రైతులు ముందుకు రావాలని కోరారు. ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పని చేస్తే రోజువారీ కూలి రూ.300 వరకు పడుతుందని తెలిపారు. జాబ్ కార్డు ఉండి గతేడాది వంద రోజులు పని దినాలు అయిపోయిన వారి కుటుంబంలో ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఉంటే వారికి ఉన్నతి ప్రోగ్రాం ద్వారా డీజిల్ మెకానిక్, సెల్ రిపేర్, సెల్ తయారు, కుట్టు మిషన్, కంప్యూటర్, ఎలక్ట్రీషియన్, తాపీ మేస్త్రి వంటి వాటిలో మూడు నెలలు శిక్షణ ఇచ్చి, మూడు పూటలా అన్నం పెట్టి, రోజుకు రూ.300 కూలి ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ తర్వాత ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలో రూ.15 వేల నుంచి రూ.20 వేల తీసుకునేలా ఉద్యోగం కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న యువతి, యువకులు తమ గ్రామాల్లోనే ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల దగ్గరకు వెళ్లి పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఉపాధి పని ప్రదేశంలో కూలీలకు ఏదైనా ప్రమాదం జరిగినా, వడదెబ్బ కొట్టినా ప్రభుత్వాస్పత్రుల్లో చేరిన సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. ఆ సర్టిఫికెట్ తీసుకొని ఎపిఒకు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్లస్టర్ టిఎ గంగన్న, డిఆర్‌పి వెంకటరాముడు, టెక్నికల్ అసిస్టెంట్ నాగన్న, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్, గాదిలింగ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎపి సెట్‌లో జనార్ధన్‌రెడ్డి ఉత్తీర్ణత

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఎపి సెట్ అర్హత పరీక్షలో సాయి కళాశాలలో ప్రిన్సిపల్, గణితశాస్త్రం బోధిస్తున్న వివి.జనార్ధన్‌రెడ్డి ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం వల్ల డిగ్రీ కళాశాల లెక్చరర్‌కు, విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత పొందారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు శుక్రవారం అభినందనలు తెలిపారు.


కౌంటింగ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను తిలకిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

ఓట్ల లెక్కింపు సిబ్బందికి
మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంబంధించి మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ సూచించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా కౌంటింగ్ సిబ్బంది 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామన్నారు. కౌంటింగ్ కోసం 813 మంది కౌంటింగ్ సిబ్బందిని సిపిఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం.దాసు, కామేశ్వరావు, ఎన్ఐసి నెట్వర్క్ ఇంజనీర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూర 'గాయాలు'

- అమాంతం పెరిగిన ధరలు - డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడమే కారణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూరగాయల ధరలు రోజురోజుకూ కొండెక్కుతున్నాయి. డిమాండుకు సరిపడా సరఫరా లేకపోవడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు...

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సాధారణంగా వేసవిలో టమాటాల ధర మాత్రమే పెరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం అన్ని రకాల కూరగాయల రేట్లు చుక్కల్లో చేరాయి. రాష్ట్రంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వర్షాలు సరిగ్గా లేకపోవడంతో పంట ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. దీంతో అన్నిరకాల ధరలకు రెక్కలొచ్చాయి. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.150పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలో ఏ రోజుకా రోజు కూరగాయలు కొనుగోలు చేయడం ఎక్కువ. దీంతో చాలా మంది తోపుడుబండ్ల తో కాలనీల్లో తిరుగుతూ కూరగాయలు విక్రయిస్తుంటారు. కానీ వాటి ధరలు అధికంగా ఉండటంతో తోపుడు బండ్ల వారు రావడమే మానేశారు. కర్నూలు మార్కెట్ యార్డుకు స్థానిక రైతులు పండించిన కూరగాయలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కూడా కూరగాయలు వస్తున్నాయి. వాటిని కొందరు కొనుగోలు చేసి రైతు బజార్‌లలో విక్రయిస్తుంటారు. స్థానికంగా టమోటా దిగుబడి సరిగ్గా లేకపోవడంతో కర్నూలు మార్కెట్‌కు మదనపల్లి, మొలకలచెరువు నుంచి టమోటాలు వస్తున్నాయి. ప్రస్తుతం స్థానికంగా మిర్చి పంట లేకపోవడంతో కర్ణాటకలోని బెళగాం నుంచి మిర్చి వస్తోంది. వంకాయ, క్యారెట్, క్యాబేజీ, ఆలూ, చెవులేకాయ వంటి కూరగాయలు స్థానికంగా చుట్టు పక్కల ప్రాంతాల రైతులు తీసుకువస్తున్నారు. డిమాండుకు సరిపడా సరుకు రాకపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. కర్నూలు నగరంలో మొన్నటి వరకూ కిలో రూ.25 ఉన్న టమోటా ప్రస్తుతం రూ.40 పలుకుతోంది. టమోటాతో పాటు అన్ని కూరగాయల ధరలు పెరిగిపోయాయి. మొన్నటి వరకూ కిలో రూ.40 ఉన్న వంకాయ రూ.50, రూ.30 ఉన్న బెండ రూ.40కు, రూ.40 ఉన్న పచ్చిమిర్చి రూ.70కు పెరిగాయి. కాకర, బీర కిలో రూ.80, కాలీఫ్లవర్ రూ.45, క్యారెట్ రూ.55, క్యాబేజీ రూ.40, ఆలూ కిలో రూ.50, చెవులేకాయ రూ.50, బీట్‌రూట్ రూ.46కు విక్రయిస్తున్నారు. అల్లం ధర అమాంతం పెరిగిపోయింది. ప్రస్తుతం కిలో రూ.200కు పెరిగింది. నంద్యాలలో టమోటా కిలో రూ.50, వంకాయ కిలో రూ.60, మునక్కాయలు ఒక్కోటి రూ.10, బీరకాయ కిలో రూ.60, ఆలూ రూ.50, క్యారెట్ రూ.40కు విక్రయిస్తున్నారు. ఆదోనిలో టమాటాలు కిలో రూ.60కి విక్రయిస్తున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.23 నుంచి రూ.50కి చేరాయి. ఆలూ, బీన్స్, క్యాబేజీ పువ్వు గత నెలలో కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.90కి విక్రయిస్తున్నారు. క్యారెట్ రూ.40 నుంచి రూ.70కి చేరుకుంది. బీరకాయలు, గోరుచిక్కుడు, వంకాయలు, దొండకాయలు, బెండకాయలు, క్యాబేజీ రూ.30 నుంచి రూ.60కి పెరిగాయి. సొరికంద రూ.20 నుంచి రూ.30కి, కాకరకాయలు రూ.30 నుంచి రూ.50కి చేరుకున్నాయి. కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యుల జేబులు చిల్లుపడుతున్నాయి.

ఆర్థిక భారమే..

రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలతో మధ్య తరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక భారం పడింది. ధరలు పెరగడంతో రోజువారీ వంటకాల్లో ఉల్లి, టమాట వినియోగాన్ని తగ్గించేస్తున్నాం. ధరల భారంతో కుటుంబ పోషణ కష్టమవుతోంది.

- పార్వతమ్మ, ఆదోని.

ధరలు మండిపోతున్నాయి..

కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. సామాన్యులు కూరగాయలు తినలేని పరిస్థితి ఉంది.. టమోట కిలో రూ.50 రూపాయలు, వంకాయ కిలో రూ.60, మునక్కాయలు ఒక్కొక్కటి 10 రూపాయలు పలుకుతుంది. కాబట్టి కూరగాయల ధరలను తగ్గించాలని కోరుతున్నాం.

- దేరంగుల రామేశ్వరి, నంద్యాల.

పిడుగు పాటుకు గడ్డివాము దగ్ధం

- గాలి వానకు కూలిన విద్యుత్ స్తంభాలు
- పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన ఉరుములు, మెరుపుల వర్షానికి మిట్టకందాల గ్రామంలో రైతు రవికి చెందిన గడ్డివాముపై పిడుగు పడి దగ్ధమైంది. గ్రామస్తులు ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రానికి ఫోను చేసి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. రైతుకు దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లింది. అలాగే గాలివానకు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన కరెంటు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు.

మంటలను ఆర్పుతున్న స్థానికులు

'ఉపాధి' సొమ్ము కొండల పాలు

- ఎవరికీ ఉపయోగనపడని కొండలపై ఉపాధి పనులు
- వ్యవసాయ, రోడ్లు, పంట కాలువల మరమ్మతులు చేయించాలంటున్న రైతులు, ప్రజలు

కొండపైన ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ముళ్ళ కంపలతో మూసుకుపోయిన రిజర్వాయర్‌కు వెళ్లే దారి

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలో చేపడుతున్న జాతీయ ఉపాధి హామీ పనులు ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేకుండా ఉంటున్నాయి. మండలంలో కేవలం కొండలపైనే పనులు చేస్తుండడంతో వాటి వల్ల ప్రయోజనమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కోట్ల రూపాయల ఉపాధి నిధులు కొండలపాలవుతున్నాయని ప్రజలు, రైతుల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవుకు పట్టణంలో ప్రతిరోజు 800 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. అవుకు రిజర్వాయరు చుట్టూ ఉన్న కొండలపై ఉపాధి అధికారులు కూలీలతో పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల వల్ల ఎటువంటి ఉపయోగం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉపాధి పనులను వ్యవసాయ భూముల్లో రైతులకు ఉపయోగపడే విధంగా చేపట్టడం, పంట కాలువల మరమ్మతులకు ఉపయోగించడం, రోడ్లకు ఇరువైపులా చెట్లను తొలగించడం వలన ఇటు రైతులకు, అటు ప్రజలకు, వాహనదారులకు అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అవుకు మండలంలో ప్రతి ఏటా ఉపాధి పనులు కొండలపైనే చేపడుతున్నారు. గతంలో చేపట్టిన ప్రాంతాల్లోనే మళ్లీ పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనివలన కోట్లాది రూపాయలు కొండలపాలు అవుతున్నా సంబంధిత అధికారులు కొండలపైనే ఉపాధి పనులు ఎందుకు చేయిస్తున్నారో అర్థం కావడం లేదని బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఉపాధి పనులు వ్యవసాయ పొలాల్లో చేపించడం వలన కొంతమేర పెట్టుబడులు తగ్గి ఊరట లభిస్తుందని కొందరు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి కూలీలు కూడా కొండలపైన పనులు చేయాలంటేనే చాలా ఇబ్బందిగా ఉందని, ఎత్తైన కొండలను ఎక్కి దిగాలంటే చాలా ఇబ్బందులు పడవలసి వస్తోందని వాపోతున్నారు. ఎత్తయిన కొండలపై ముళ్లకంపల మధ్య పనులు చేపించటం వల్ల ఏ చిన్న పొరపాటు జరిగినా మనిషి జారి కింద పడే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవుకు రిజర్వాయరుకు వెళ్లే మార్గం ముళ్ళకంపలతో నిండిపోయింది. ఆ దారి వెంట అధికారులు వెళ్తున్నారే తప్ప ఉపాధి పనుల కింద ముళ్ళకంపలను తొలగించే ప్రయత్నం చేయక పోవడంలో ఆంత్యరమేమిటో అర్థం కావడం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఉపాధి పనులను రైతు పొలాల్లో, రోడ్లకు ఇరువైపులా ముళ్ళ కంపలను తొలగించడం, పంట కాలువలకు మరమ్మతులు చేయడం లాంటివి చేయించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఉపాధి కింద పంట కాలువల మరమ్మతులు చేయించాలి

ప్రతి ఏటా వర్షాకాలం సీజన్లో పొలాలకు వెళ్లే పంట కాలువలపై కూలీలతో పనులు చేపించాలంటే రైతులకు ఖర్చుతో కూడుకున్న పని. అందువలన ప్రభుత్వం ఉపాధి పనుల కింద కూలీలతో కాల్వల మరమ్మతు పనులు చేయించాలి. ఉపాధి కింద పొలాల్లో ఉన్న పంట కాలువల్లో పనులు చేయించడం వలన రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది.

- జక్కా బాలుడు,రైతు. అవుకు.

పొలాల రస్తాలను ఉపాధి పనులతో బాగు చేయించాలి

పొలాలకు వెళ్లే రస్తాలను ఉపాధి పనులతో బాగు చేయించాలి. ఎక్కడో కొండల్లో ఉపాధి పనులు చేయించే దానికన్నా రైతులకు, ప్రజలకు ఉపయోగ పడే విధంగా పొలాల రస్తాలను బాగు చేయించాలి. రైతులు పండించిన పంటలను ఇంటికి చేర్చుకోవడానికి పొలాల రస్తాలు బాగా లేకపోవడంతో నానా అవస్థలు పడుతూ పంటలను ఇండ్లకు చేర్చుకుంటున్నాం. అందువలన ఉపాధి పనులతో పంట పొలాల రస్తాలను బాగు చేయించాలి.

- గొల్ల పెద్ద వెంకటేశ్వర్లు. రైతు సంఘం మాజీ మెంబర్.

పొలాల గట్లు, రోడ్లకు ఇరువైపులా ముళ్లకంపలను తొలగించాలి

ఉపాధి హామీ పనుల కింద రైతుల పొలాలకు ఉన్న గట్లను, రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ళకంపలను తొలగిస్తే అందరికీ మేలు జరగుతుంది. కొండల్లో జరుగుతున్న ఉపాధి పనుల వల్ల ఎవరికి ఎటువంటి ప్రయోజనం లేదు. ప్రభుత్వ సొమ్ము వృధాగా పోవడం తప్ప ఎవరికీ ఫలితం ఉండదు. అందువలన ఉపాధి కూలీలతో పొలాల రస్తాలు, రోడ్లకు ఇరువైపులా ముళ్ళకొంపలను తొలగించడం వలన ప్రజలకు, రైతులకు చాలా ఉపయోగపడుతుంది.

- వెలుగు ముని రంగస్వామి, రైతు, అవుకు.

గుర్రపు డెక్కతో నిండుకున్న కుందూ నదిని పరిశీలిస్తున్న నాయకులు

కుందూ, మద్దిలేరు వాగుల్లో
గుర్రపు డెక్కను తొలగించాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

కుందూ నది, మద్దిలేరు వాగుల్లో అల్లుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో కుందు, మద్దిలేరు వాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుందు, మద్దిలేరు వాగులు వేసవికాలం పూర్తిగా ఎండిపోతాయని,ఆ సమయంలో గుర్రపు డెక్క ఆకులు నది పొడవునా అల్లుకుపోతాయన్నారు. వర్షాకాలం మొదలు కావడంతో ఆ వరద నీటితో వంతెనగండ్లకు పూర్తిగా అడ్డుపడి ఆ వరద నీరు కాలనీలలోకి ఎగదనడం జరుగుతుందన్నారు. గుర్రపు డెక్క ఆకులు గండ్ల దగ్గర నిలిచి కుళ్ళి విషవాయువులు వెదజల్లడంతో కింది గ్రామాల వారు ఆ నీటిని తాగి అంటు రోగాల బారిన పడుతూ ఉంటారని తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వెంటనే కుందు, మద్దిలేరు వాగులలో అల్లుకుపోయిన గుర్రపు డెక్క ఆకులను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఏఐటియుసి పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాసులు, నందమూరి నగర్ శాఖ కార్యదర్శి హుస్సేన్ సా పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ ఉత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో పల్లకి సేవ ఉత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో పల్లకి సేవ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పల్లకి సేవలో చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహం

రౌండ్ల వారి ఓట్ల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలి

- జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్‌కు సంబంధించి ఎన్నికల ఫలితాల రౌండ్ల వారి ఓట్ల వివరాలు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్‌కు సంబంధించి జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఆన్లైన్ ఎంట్రీ డాటాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకు సంబంధించి రౌండ్ల వారి ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు రిజల్ట్స్ eci.gov.in వెబ్సైట్ నందు, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ నందు, ఎలక్షన్ ట్రెండ్స్ టీవీ నందు తెలుసుకునేందుకు వీలుగా జాగ్రత్తగా నమోదు చేయాలని శిక్షణ పొందుతున్న కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులను ఆదేశించారు. ఈ డాటా ఎంట్రీ వలన ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుందన్నారు. అదేవిధంగా డాటా ఎంట్రీ చేసే సమయంలో కంప్యూటర్ సహాయకులు ఓట్ల లెక్కింపు వివరాలను, అభ్యర్థులకు ఏ రౌండ్ లో ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను కూడా చాలా జాగ్రత్తగా నమోదు చేయాలని శిక్షణ పొందుతున్న సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, మున్సిపల్ ఇంజనీర్ మధు కుమార్, అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్

టిడిపి అధికారంలోకి రావడం తథ్యం : జయసూర్య

ప్రజాశక్తి - కొత్తపల్లి

రాష్ట్రంలో టిడిపి అత్యధిక సీట్లు గెలిచి అధికారంలోకి రావడం తథ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య తెలిపారు. శుక్రవారం కొత్తపల్లిలో టిడిపి మండల కన్వీనర్ నారపరెడ్డి క్లస్టర్ కోఆర్డినేటర్ లింగ స్వామి గౌడ్ మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకతతో మార్పు కోరుకుంటున్నారని, టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. అలాగే నందికొట్కూరు నియోజకవర్గంలో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్దే ధ్యేయంగా పని చేస్తామన్నారు. నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి సహకారంతో టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మండల నాయకులు మోహన్ యాదవ్, నాగేశ్వరరావు యాదవ్, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, జిఎండి రఫీ, సున్నంపల్లె శ్రీనివాసులు, పరమేశ్వర్ రెడ్డి, మోహన్ యాదవ్, జడ్డు వెంకట్ రెడ్డి, మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, స్వామి రెడ్డి, శివారెడ్డి, రామకష్ణ రెడ్డి, రహీం ఖాన్, లింగన్న, రాధాకృష్ణారెడ్డి, రఫీ, జహు రుల్లా, జానకి రాముడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య

కెనరా బ్యాంకులో షార్ట్ సర్క్యూట్

- ఫర్నిచర్, ఫైల్స్ దగ్ధం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్ కెనరా బ్యాంకులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా బ్యాంకులో మంటలు చెలరేగాయి. బ్యాంకులోని మేనేజర్ క్యాబిన్, ఫర్నిచర్, ఫైల్స్ దగ్ధమయ్యాయి. పక్కనే ఉన్న మీసేవ సెంటర్లోని ఫర్నిచర్ కూడా కాలిపోయింది. లాకర్ రూము భద్రంగా ఉన్నట్టు సిబ్బంది తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బ్యాంకు లోపల ఎక్కువగా పొగ ఉండడంతో లోపలికి పోవడం సాధ్యం కాలేదు. ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పిన తర్వాత సిబ్బంది లోపలికి వెళ్లి పరిశించారు. విషయం తెలిసిన కెనరా బ్యాంక్ కస్టమర్లు బ్యాంకు వద్దకు పరుగులు తీశారు. కస్టమర్లు బ్యాంక్ సిబ్బందిని నిలదీశారు. బ్యాంకులో లాకర్లో తమ వస్తువులు ఉన్నాయా, లేవా, బంగారు లోన్ తీసుకున్న వారు తమ నగలు ఎలా ఉన్నాయంటూ అధికారులను అడిగిఆరు. వారికి బ్యాంక్ అధికారులు సమాధానం చెబుతూ బ్యాంకులో ఏమీ కాలిపోలేదని, కేవలం ఏసి, ఫర్నిచర్ కాలిపోయాయని, అంతకుమించి బ్యాంకులో ఎటువంటి ప్రమాదం జరగలేదని కస్టమర్లకు హామీనిచ్చారు.

కెనరా బ్యాంక్‌లో కాలిపోయిన ఫర్నిచర్

పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- 1761 మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో పదవ తరగతి సప్లిమెంటరి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా సజావుగా నిర్వహించారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలలో 2,968 విద్యార్థులకు గాను 1,207 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 1,761 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 3 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు 13 పరీక్షా కేంద్రాలను సందర్శించినట్లు డిఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు.

నేడు శ్రీశైలానికి మధ్యప్రదేశ్ సిఎం రాక

ప్రజాశక్తి - శ్రీశైలం

నేడు శ్రీశైలం మల్లన్న దర్శనార్థం శ్రీశైలం క్షేత్రానికి మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్ రానున్నారు. శనివారం ఉదయం 9:40 గంటలకు హైదరాబాదు నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో సుండిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుండి ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు స్వామి అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రైవేటు పాఠశాలలు, కళాశాల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని నంద్యాల జిల్లా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఇటీవల ప్రమాదానికి కారణమైన వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం వారికి సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు పాఠశాలల పునః ప్రారంభం అయ్యే లోపల చేయించుకోవాలన్నారు. బస్సులకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన సీనియర్ డ్రైవర్లను పెట్టుకోవాలన్నారు. బస్సులు కండీషన్, టైర్లు, హెడ్ లైట్లు బాగుండాలని, ఎమర్జెన్సీ ఎగ్జిట్, పిల్లలు దిగడానికి వీలుగా బస్సు ఫుట్‌బోర్డు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫస్ట్‌ఎయిడ్ బాక్సు, అగ్ని మాపక రక్షణ పరికరాలు లేకపోతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వబోమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ను పరిశీలిస్తున్న ఎంవీఐ

గాలి వానకు విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

గాలి వాన బీభత్సం

- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె మండలంలోని పడమటి పల్లెల్లో గాలివాన బీభత్సంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. శుక్రవారం సాయంత్రం చిన్న రాజుపాలెం, చిన్న రాజుపాలెం తండా, పెద్దరాజుపాలెం, కాలే నాయక్ తండా, బద్రే నాయక్ తండా, పసుపల తండా, పసుపల గ్రామాలలో గాలివాన కురిసింది. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్తుకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం కురవడంతో పడమటి పల్లెల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బిఎల్‌ఒలకు అందని గౌరవ వేతనం

- మూడు సంవత్సరాలుగా అందని వైనం
- పని ఎక్కువ.. పారితోషికం తక్కువ..

ప్రజాశక్తి - బనగానపల్లె

పోలింగ్ స్టేషన్ల పర్యవేక్షణ అధికారులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. బిఎల్‌ఒలకు శ్రమ ఎక్కువ, పారితోషికం తక్కువ. గౌరవ వేతనం అందక బిఎల్వోలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో 277 మంది బిఎల్వోలు ఉన్నారు. వీరికి మూడు సంవత్సరాల నుండి గౌరవ వేతనం అందడం లేదు. 2019 ఎన్నికల సమయంలో కూడా బిఎల్వోలకు గౌరవ వేతనం ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో కూడా బిఎల్‌ఓలకు గౌరవ వేతనం అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. బిఎల్వోలు సొంతంగా తెచ్చిన ఖర్చు కూడా రాక గౌరవ వేతనం రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు బిఎల్వోలు ఓటర్ నమోదు మొదలుకొని రెండు ఓట్ల తొలగింపు, నియోజకవర్గల మార్పు, ఓటర్ సవరింపు తదితర వాటి కోసం, ఫారం-6, ఫారం-7, ఫారం-8, ఫారం- 6బి ప్రక్రియను చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ. 500 గౌరవ వేతనాన్ని ప్రకటించింది. ఓటర్లను చైతన్యం చేయడం, ఓటు హక్కును వినియోగించుకోవడం, 85 సంవత్సరాలు దాటిన వారిని, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారిని ఓటు వినియోగించడంతోపాటు, ఎన్నికల సమయంలో ఆయా బూతుల పరిధిలో ఓటర్ స్లిప్పులను ఇంటింటికీ వెళ్లి బిఎల్‌వోలు పంపిణీ చేస్తారు. జనవరి 25న జాతీయ ఓటర్ దినోత్సవం రోజున, ప్రతి ఏడాది చివరిలో డిసెంబర్‌లో ఓటు నమోదు కార్యక్రమాలను బిఎల్వోలు నిర్వహిస్తారు. బిఎల్వోల శ్రమ ఎక్కువగా ఉన్నా పారితోషికం మాత్రం తక్కువగా అందిస్తున్నారు. అందించాల్సిన పారితోషికం కూడా మూడు సంవత్సరాల నుండి అందలేదని బిఎల్‌ఒలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం బిఎల్‌ఒలకు స్టేషనరీ ఖర్చుల కింద ప్రభుత్వం అందించాల్సి ఉంది. ఎన్నికల విధులు నిర్వహించిన పిఓ, ఎపిఓలకు, సిబ్బందికి అధికారులు పారితోషికం చెల్లించారు. కానీ బిఎల్వోలకు మూడు సంవత్సరాల నుండి గౌరవ వేతనం కానీ, స్టేషనరీ ఖర్చులు గానీ చెల్లించలేదు. దీంతో బిఎల్వోలు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్, అధికారులు స్పందించి గౌరవ వేతనం, స్టేషనరీ ఖర్చులు ఇవ్వాలని బిఎల్వోలు కోరుతున్నారు.

తహశీల్దార్ కార్యాలయం

పంటల సాగుపై అవగాహన అవసరం

- డోన్ వ్యవసాయ శాఖ ఎడిఎ అశోక్ రాజా వర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలంలోని ఆయా గ్రామాల సచివాలయ పరిధిలో గల గ్రామాల రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన చాలా అవసరమని డోన్ వ్యవసాయ శాఖ ఏడిఏ అశోక్ రాజా వర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బేతంచెర్ల మండల కేంద్రంలోని మండల వ్యవసాయ కార్యాలయంలో అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్లో రైతులకు ఏఏ పంట వేయాలి, పంటల సాగుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై అవగాహన శిక్షణ కార్యక్రమం అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, హార్టికల్చర్ అసిస్టెంట్లకు, సెరికల్చర్లకు, ఏపీవోలకు, ఏఈఓలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ రైతులు ఈ సీజన్లో ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని సచివాలయాల దగ్గరికి వెళ్లి రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్న వేరుశనగ, కంది, కొర్ర, మినుము, పెసలు విత్తనాలను, ఎరువులు రైతులకు ఎంత స్టాకు వచ్చింది, ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, మహమ్మద్, బెన్ని రాజు, రైతులు, అగ్రికల్చర్, సెరికల్చర్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డోన్ వ్యవసాయ శాఖ ఎడిఎ అశోక్ రాజా వర్ధన్ రెడ్డి

కుందూలోకి కలుషిత నీరు చేరకుండా చూడాలి

- బెస్త సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వెంకట రమణయ్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నుండి ఆళ్లగడ్డ వరకు ప్రవహిస్తున్న కుందూ నదిలో ప్రవహిస్తున్న నీరు విష కలుషితం కావడంతో, అందులో జీవిస్తున్న జల రాశులు, చేపలు చనిపోతున్నాయని, కుందూలోకి కలుషిత నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని బెస్త సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు జి. వెంకటరమణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని శ్రీనివాస నగర్‌లోని తన కార్యాలయంలో బెస్త సంఘం నాయకులు సుబ్బయ్యతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుందూ నది పరివాహక ప్రాంత ప్రజలు నీటిని వాడుకోవడానికి, జంతువులు తాగడానికి పనికి రాకుండా పోతున్నాయని, ఒక వేళ ఆ నీటిని పశువులు తాగితే చనిపోతున్నాయని చెప్పారు. ప్రజలు వాడుకుంటే రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుందులోకి నంద్యాలలోని ఎస్‌పివై రెడ్డి కెమికల్ ఫ్యాక్టరీ నుండి విష కలుషిత నీటిని వదులుతున్నరన్నారు. శాంతిరాం మెడికల్ ఆసుపత్రి నుండి వేస్టేజి అంత కుందూలోకే వదులుతున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోని కుందు నదిలో చేపలు బతికేలా చూడాలన్నారు. లేకుంటే భవిష్యత్‌లో బెస్తల ను కలుపుకొని ఆందోళనకు దిగుతామన్నారు. సమావేశంలో నంద్యాల బెస్త సొసైటీ సభ్యులు అనకల శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకట రమణయ్య

ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు శంకరయ్య మృతి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండల ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు, స్థానిక బాలాజీ రైస్‌మిల్ పార్ట్నర్ బచ్చు గోపాల శంకరయ్య శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. గత కొద్ది రోజుల నుండి ఆయన వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈయన మృతి పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు ఆర్య వైశ్యసంఘం నాయకులు గోపాల శంకరయ్య కుటుంబానికి సంతాపాన్ని ప్రకటించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచర్ల పట్టణంలోని బనగానపల్లి రైల్వే గేట్, రైల్వే స్టేషన్‌కు మధ్యన రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న డోన్ రైల్వే పోలీస్ అధికారులు ఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు దాదాపు 40 సంవత్సరాలు వయసు గల వ్యక్తి అయి ఉండవచ్చని తెలిపారు. రైలు ఢీకొట్టడంతో మృతుడి శరీర భాగాలు చెల్లాచెదురై గుర్తుపట్టలేనంతగా పడిపోయాయి.

మృతదేహన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

సెట్ అర్హత సాధించిన వీరస్వామి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్న వి.టి. వీరస్వామి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజబులిటీ టెస్ట్ (సెట్) అర్హత సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ కామర్స్ సబ్జెక్టులో ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ సెట్ ఫలితాలలో 55 శాతం మార్కులతో అర్హత సాధించానని తెలిపారు. బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పని చేస్తూ సెట్ అర్హత సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. అర్హత సాధించిన వీరస్వామిని కళాశాల యాజమాన్యం, తోటి అధ్యాపక బృందం అభినందించారు.

వీరస్వామి

బ్రాంచ్ మేనేజర్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని జీవిత బీమా సంస్థ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్‌గా పని చేస్తున్న ఎస్.శ్రీనివాసులు బనగానపల్లె బ్రాంచ్‌కి బదిలీపై వెళ్తున్న సందర్భంగా లియాఫి ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు ఆయనను శుక్రవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నూకా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రాంచ్ ఏజెంట్లు ఆయనను శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ నాగభూషణం శెట్టి మాట్లాడుతూ గత 3 సంవత్సరాలుగా ఆళ్లగడ్డ మేనేజర్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు బ్రాంచ్ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. నంద్యాల బ్రాంచ్ మేనేజర్ పులి నాయక్ మాట్లాడుతూ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసులు, తాము ఎన్నో సంవత్సరాలుగా కలిసి పని చేశామని, ఇద్దరం మంచి మిత్రులమన్నారు. ఉద్యోగ జీవితంలో బదిలీ, విరమణ తప్పనిసరి అంశమని తెలిపారు. సన్మాన గ్రహీత సాకే శ్రీనివాసులు మాట్లాడుతూ ఆళ్లగడ్డ బ్రాంచ్‌లో పని చేసిన కాలంలో ఏజెంట్లు, అభివృద్ధి అధికారులు, సిబ్బంది తనకు అందించిన సహకారం మరచిపోలేనిదని అన్నారు. అందరి కృషి వల్ల బ్రాంచి మంచి అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న బివిఎస్ఎల్ శ్రీనివాసులును కూడా ఏజెంట్లు సత్కరించారు. కార్యక్రమంలో నంద్యాల ఎబిఎంలు నాగార్జున, సంతోష్ కుమార్, బ్రాంచి ఏవో సుబ్బారెడ్డి, ఏయేఓ సురేంద్రనాథ్, నంద్యాల బ్రాంచి భీమా ఉద్యోగుల సంఘం నాయకుడు రమేష్ బాబు, డెవలప్మెంట్ అధికారులు, క్లియాలు నాగభూషణం శెట్టి, ఖాసీంవలి, రామకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాసులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

బ్రాంచ్ మేనేజర్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

సుంకేసులలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని సుంకేసుల గ్రామంలో నందికొట్కూరు రూరల్ ఇన్స్పెక్టర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ముచ్చుమర్రి, మిడ్తూరు ఎస్ఐలు స్థానిక పోలీసు సిబ్బందితో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఎటువంటి అల్లర్లు జరుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాల్లో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. శాంతియుతంగా మెలగాలని, జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచామని, నేడు వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఎన్నికలలో గెలిచినవారు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, క్రాకర్స్ కాల్చడం చేయరాదన్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ పోలీసు కవాతు నిర్వహించామని తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు జగన్మోహన్, జయ శేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న విత్తనాల దుకాణదారులు కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు ఉంటాయని, రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి మహేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొక్కెరంచ, నాగంపల్లి గ్రామాల్లో ఉన్న విత్తన దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విత్తన రిజిస్టర్లను, బిల్ బుక్‌లను, లైసెన్స్ పత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, అమ్మే విత్తనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని శ్రీరామ, పల్లవి హైబ్రిడ్, పవన్, విశ్వంభరా లలిత సీడ్స్ తదితర విత్తనాల షాపులను మండల వ్యవసాయ అధికారి షేక్షావలి తనిఖీ చేశారు. సందర్భంగా కాటన్ విత్తనాల మీద పరీక్షలు నిర్వహించారు. పత్తి విత్తనాలలో హెచ్‌టి కాటన్ ఉందా లేదా అనే విషయంపై పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని షాప్ యజమానులకు హెచ్చరించారు. అనంతరం స్టాక్ వివరాలను పరిశీలించారు.

మరణించిన వ్యక్తి నేత్రాలు దానం

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామ వాసి ఎస్.దానమయ్య (72) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉండి శుక్రవారం మధ్యాహ్నం మరణించాడు. అయితే కుటుంబ సభ్యులకు ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి అంబాపురం రామ్మోహన్ నేత్రాలు దానం చేసే విషయంపై అవగాహన కల్పించారు. దీంతో కుటుంబ సభ్యులు మరణించిన దానమయ్య కళ్ళను ఇంటర్నేషనల్ ఐ బ్యాంకు వారికి ఐ బ్యాంకు వారికి దానం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు భార్య లక్ష్మీదేవి కుమారుడు తిరుమలేష్, రామయమ్మ రైతు సంఘం నాయకుడు రామ్మోహన్ మాట్లాడుతూ చనిపోయిన వ్యక్తి దేహంతో పాటు కళ్ళ మట్టిలో కలిసిపోకుండా ఇతరులకు దానం చేయడం చూపు లేని వారికి చూపు కల్పించే గొప్ప కార్యం ఇంకొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఐ బ్యాంకు అధికారి ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్ట్యూట్ డాక్టర్ కె.గంగాధర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దానమయ్య కళ్ళను ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ అధికారి గంగాధర్ కు అప్పజెప్తున్న భార్య లక్ష్మీదేవి, కుమారులు

ఎపిపిఎస్‌సి పరీక్షను పకడ్బంధీగా నిర్వహించండి

- జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ నెల 25వ తేదీ నిర్వహించనున్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టుల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీ పరీక్షలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ ఉద్యోగాల భర్తీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, మున్సిపల్ టౌన్ హాల్ ఎదురుగా (ఆపోజిట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్), శ్రీ రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, (అటానమస్) ఎస్బిఐ కాలనీ చివర, గుడ్ షెఫర్డ్ స్కూల్ రోడ్డు, ఎస్‌విఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, అయ్యలూరు మెట్ట... మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 605 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. అభ్యర్థులు ఉదయం 7.30 గంటల నుండి 8:15 గంటలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్‌గా 8.30 గంటలకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఆపై వచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లో పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోరని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైన ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఐడి కార్డ్ తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్స్ కానీ ఎలక్ట్రానిక్ పరికరాలు కానీ అనుమతించబడవు. పరీక్షలు నిర్వహించే యంత్రాంగం ఎవరు కూడా సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకుపోకూడదని, కేంద్రాలలో తాగునీటి సౌకర్యం, మెడికల్ కిట్ క్యాంపు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలను చేరుకోవడానికి ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజ, ఏపిపిఎస్సీ ఎగ్జామ్స్ అబ్జర్వర్స్ ఎస్ఎన్. షరీఫ్, అసిస్టెంట్ సెక్రటరీ పి. డిల్లేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్, లైజన్ ఆఫీసర్స్, చీఫ్ సూపరిడెంట్, పోలీస్ శాఖ, ఆరోగ్యశాఖ, ఆర్టీసీ మొదలగు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

కొండమనాయునిపల్లెలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని కొండమీది గ్రామాలైన కొండమ నాయిని పల్లెలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బనగానపల్లె సిఐ తిమ్మారెడ్డి శుక్రవారం తెలిపారు. సిఐ మాట్లాడుతూ కౌంటింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్ది గ్రామాల్లో అలుజడులు చెలరేగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సమస్యాత్మక గ్రామాల్లో కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రైనింగ్ డిఎస్పి రఘువీర్ ఆధ్వర్యంలో పలు అనుమానాస్పద ఇళ్లల్లో స్థలాలలో సోదాలు నిర్వహించామని చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ప్రజలకు, చిన్న చిన్న నాయకులకు, గ్రామ నాయకులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, బెట్టింగులు, గెలిచిన తర్వాత బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధమన్నారు. కార్యక్రమంలో అవుకు ఎస్సై కిరణ్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రమాదమని తెలిసినా రోడ్డుపైనే ధాన్యం ఆరబోత

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రధాన రహదారుల మలుపులు ప్రమాదమని తెలిసినా మలుపుల వద్ద కూడా ధాన్యం ఆరబోయడానికి రైతులు వదలడం లేదు. మండల కేంద్రమైన రుద్రవరం అప్పనపల్లె ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిలో శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ప్రధాన రహదారి మలుపు ప్రమాదకరంగా ఉంది. రహదారులపై మొక్కజొన్న ధాన్యం ఆరబోసుకోవడం రైతులకు పరిపాటి అయింది. అయితే రహదారుల మలుపుల వద్ద ప్రమాదకరమని తెలిసినా ధాన్యం ఆరబోయడం రైతులు మానుకోవడం లేదు. శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి దర్శనార్థం ఈ రహదారిలో అధిక సంఖ్యలో భక్తులు వాహనాల రాకపోకలు సాగిస్తారు. బాటసారులు నడకదారిన ప్రయాణం సాగిస్తారు. ఇలా మలుపు వద్ద ధాన్యం ఆరబోయడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయని వాహనదారులు, బాటసారులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద రైతులు ధాన్యం ఆరబోయకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మలుపు రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

'కార్పొరేట్' మాయాజాలం

- ఆకర్షణీయమైన ప్రకటనలతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఎర - అక్రమ అడ్మిషన్‌లపై చర్యలు శూన్యం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థల మాయాజాలం రోజు రోజుకు పెరిగిపోతోంది. ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రచారానికి తెరలేపి విద్యార్థుల తల్లిదండ్రులకు ఎర వేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. జిల్లాలో అనేక ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ అనుమతులు లేకున్నా విద్యార్థులను చేర్చుకుంటూ దోపిడీ చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి ఫీజులు మొదలుకొని పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, టై, బెల్ట్, యూనిఫామ్ డ్రస్, బ్యాగ్ అన్ని కలిపి పాఠశాలలు తెరిస్తే తల్లిదండ్రులకు తడిసి మోపెడవుతుంది.

పేరెంట్స్ కమిటీలకు తెలియకుండానే ఫీజులు పెంపు

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పెంచుకోవాలంటే పేరెంట్స్ సమావేశాలు నిర్వహించి తీర్మానం చేసి తల్లిదండ్రుల అభీష్టం మేరకు ఫీజులు పెంచుకోవాలని ప్రభుత్వ నిబంధన. కానీ ఆచరణలో అలా జరగడం లేదు. ఇష్టానుసారంగా స్కూళ్ల యాజమాన్యాలు ఎడాపెడా ఫీజులు పెంచుతున్నాయి. ప్రశ్నించిన తల్లిదండ్రులకు మాత్రం ఇష్టం ఉంటే చదివించుకోండి లేకుంటే స్కూల్ నుండి డ్రాప్ కండి అంటూ యాజమాన్యాలు బుకాయిస్తున్నాయి.

సొమ్మొకరిది.. సోకొక్కరిది అన్న చందంగా..

జిల్లాలో ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల తీరు సొమ్మొక్కరిది.. సోకొక్కరిది అన్న చందంగా ఉంది. ఫ్రీగా పాఠశాలల ప్రచారాన్ని చేసుకుంటున్నాయి. ఫీజులు కట్టేది విద్యార్థుల తల్లిదండ్రులు. యాజమాన్యాలు మాత్రం తమ పాఠశాల లోగోను ప్రతి దానిలో వాడుతున్నారు. బుక్స్, షర్టులపైన, బ్యాగ్‌లపైన తన పాఠశాలల లోగోలు ప్రచురించిన వాటినే కొనాలి. బయట కొనడానికి వీలు లేదు.. పాఠశాలల ప్రచార ఖర్చును కూడా తల్లిదండ్రుల పైనే వేస్తున్నారు. తల్లిదండ్రుల బలహీనతను ఆసరా చేసుకోని యాజమాన్యాలు లక్షల రూపాయలు దండుకొంటున్నాయి. అవే బుక్స్ బయట కొంటె చాలా తక్కువ.

కొరవడుతున్న మౌలిక సదుపాయలు..

ఫీజులకు తగ్గట్టు పాఠశాలల్లో యాజమాన్యాలు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. విద్యార్థులకు మూత్రశాలలు కూడా సరిగ్గా ఉండని పాఠశాలలు పట్టణంలో అనేకం ఉన్నాయి. ఫీజులు మాత్రం వేలకు వేలు వసూలు చేస్తున్నాయి.

గుర్తింపు లేని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు శూన్యం..

జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకున్నా అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తూ పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపైన విద్యాశాఖ అధికారుల చర్యలు శూన్యం. అధికారులకు తెలిసినప్పటికీ తుతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ విద్యాశాఖ అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి
వారి కోర్టులో
ఎం.వి.ఓ.పి. నెం: 34/2021
ఆరేపాటి రాజేశ్వరి ..... పిటీషనర్
వర్సెస్
ఆర్.రమణ మరియు ఇతరులు .... రెస్పాండెంట్స్
టు,
ఆర్.రమణ, తండ్రి: నారాయణస్వామి
లారీ డ్రైవర్, ఐనా, కానపురం పోస్టు
డోన్ మండలం, నంద్యాల జిల్లా-518222,
ఎ.పి. అను వారికి..
పై నెంబరు పిటీషన్‌లో పరిహారం నిమిత్తం పిటీషనర్ నీ మీద పిటీషన్ దాఖలు చేసినందున నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నీకు నోటీసులు పంపించిననూ జారీ కానందున, శ్రీ కోర్టు వారు నీనోటీసు నిమిత్తం వాయిదా తేదీ: 05-07-2024న ఉన్నది. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయము గానీ, లాయరు ద్వారా గానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 05-07-2024 ఇట్లు
మార్కాపురం బి.కాశయ్య
అడ్వకేట్, మార్కాపురం.
సెల్: 9912726289.